క్లుప్తంగా

ఇసుక మాఫియా అరాచకాలను అరికట్టాలి

ప్రకాశం నగర్: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలింపునకు పాల్పడుతున్న ఇసుక మాఫియా అరాచకాలను అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు సుబ్రహ్మణ్యంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇసుక తరలింపు సమయంలో రోడ్డువెంట ఇసుక పడి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అయినా ఇసుక మాఫియా ఆగడాలు తగ్గడం లేదన్నారు. ఇటీవల ధవళేశ్వరంలో కానిస్టేబుల్ కుమార్తెను ఎక్కించుకుని వెళుతూ జారిపడి ప్రాణాలు కోల్పోయారని, అదే ధవళేశ్వరంలో సాయిబాబా గుడి వద్ద యువకుడు ఇసుకలో జారిపడటం వెనుక నుంచి వచ్చిన లారీ ఎక్కడంతో మృతివాత పడ్డాడన్నారు. కలెక్టర్ ఆదేశాలను కూడా బేఖాతరు చేసి ఇసుకు తొడుకుపోతున్నారని విమర్శించారు. తక్షణమే ఉన్నత అధికారులు ప్రభుత్వం స్పందించి ఇసుక మాఫియా ఆగడాలను, అరాచకాలను అరికట్టాలన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానా, జైలు

కంబాలచెరువు: మద్యం తాగి వాహనం నడుపుతున్న 27 మందిపై రాజమహేంద్రవరం పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వారిలో ఐదుగురిని జైలుకి పంపారు. ఈ మేరకు మూడో ఏజేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ సి.రమ్య శుక్రవారం తీర్పు వెలువరించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఉత్తర్వుల మేరకు ఇన్‌చార్జి ట్రాఫిక్ డీఎస్పీ కె.రమేష్ బాబు ఆధ్వర్యంలో నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. దీనిలో భాగంగా మొత్తం 22 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ఇద్దరికి మూడు రోజులు, మరో ఇద్దరికి రెండు రోజులు, ఒకరికి ఒక్కరోజు జైలు శిక్ష విధించారు.

బ్యాగు దొంగల అరెస్టు

కంబాలచెరువు: నడిచి వెళుతున్న మహిళ మెడలో బ్యాగు లాక్కుని, దానిలోని రూ.15 వేలతో పారిపోయిన ఇద్దరిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..ఈ నెల 10వ తేదీ తెల్లవారుజామున 35 ఏళ్ల వయసున్న మహిళ చేతిలో బ్యాగుతో నడిచి వెళుతోంది. ఆ సమయంలో ఎదురుగా ఇద్దరు వ్యక్తులు వచ్చి మహిళ చేతిలో బ్యాగు లాక్కుని పారిపోయారు. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై శ్యాంసుందర్ సిబ్బందితో కలిసి గూడ్స్‌గేట్ వద్ద నిందితుడు బైరెడ్డి మోహన్‌కుమార్, ఏపీ గార్డెన్స్‌కు చెందిన గుడ్ల లక్ష్మీనారాయణను అరెస్టు చేశారు. వీరిద్దరూ తాడేపల్లిగూడెం రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో నెమ్మదిగా వెళ్తున్న ట్రైన్‌లో ఉన్న ప్రయాణికుడి చేతిపై కొట్టి సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయిన సంఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధి కూలీకి పాము కాటు

పెదపూడి: ఉపాధి పనికి వెళ్లిన మహిళా కూలీని పాము కాటేసింది. ఆమెను వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యసేవలు అందించడంతో కోలుకుంటోంది. ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంపర గ్రామానికి చెందిన బత్తిన చిన్నతల్లి శుక్రవారం ఉపాధి హామీ పనికి వెళ్లింది. పని ముగించుకుని గట్టుపైకి ఎక్కుతున్న ఆమెను పాము కరిచింది. దీంతో ఆమె కేకలు వేయడంతో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట రమణ వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడి వైద్యులు ప్రాథమిక వైద్యం అందించి, మెరుగైన చికిత్స కోసం పెదపూడి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆమెకు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ అనూష, డాక్టర్ సుభాష్ వైద్య సేవలందించారు. దీంతో కొద్ది సేపటికి చిన్నతల్లి కోలుకుంది. సమాచారం అందుకున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో సత్యనారాయణ ఆసుపత్రికి వచ్చి బాధితురాలిని పరామర్శించారు. అనంతరం డాక్టర్ అనూషను పరిస్థితిపై ఆరా తీయగా నిలకడగానే ఉన్నట్టు తెలిపారు.

సినిమాలు



శ్యామల :	శుభం
సూర్యమినీ :	ఫైనల్ డెస్టినేషన్
సూర్యప్యాలెస్ :	మిషన్ ఇంపాజిబుల్
స్వామి :	ఏస్
శివజ్యోతి :	హిట్-3
అనుశ్రీ :	ఫైనల్ డెస్టినేషన్
రాజా :	ఫైనల్ డెస్టినేషన్
ఊర్వశి :	నిశ్శబ్ద ప్రేమ
రంభ :	ఒక బృందావనం
మేనక :	వైభవం, ఎలెవన్
అప్సర :	సింగిల్
కుమారి :	వర్షం
అశోక :	కేసరి చాప్టర్-2
నామవరం	
వీఎస్ మహల్ :	ఏస్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	ఏస్, సింగిల్
కడియం	
వెంకటసూర్య :	ఫైనల్ డెస్టినేషన్

విజ్ఞానం.. వికాసం..

- గ్రంథాలయాల్లో వేసవి తరగతులు
- అనేక అంశాలపై విద్యార్థులకు అవగాహన



గౌతమీ గ్రంథాలయంలో వేసవి శిక్షణకు హాజరైన విద్యార్థులు

ప్రకాశం నగర్: వేసవి సెలవుల్లో ఆటపాటలతో గడిపే చిన్నారులకు చదువుతో పాటు వివిధ రకాల అంశాలపై గ్రంథాలయాలు శిక్షణ ఇస్తున్నాయి. వాటిలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు దీనికి దోహదపడుతున్నాయి. తరగతి గదిలో పుస్తకాలతో కుస్తీ పడుతున్న చిన్నారులకు కొత్త విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా మారుతున్నాయి.

జూన్ 12 వరకూ తరగతులు

ఏపీ పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయం, సీతంపేట గ్రంథాలయం, దానవాయిపేట మహిళా గ్రంథాలయాల్లో మే నెల ఒకటో తేదీ నుంచి వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జూన్ 12 వరకూ వీటిని నిర్వహిస్తారు. ఈ తరగతులకు హాజరైన చిన్నారులకు తెలుగు పద్యాలు, చిత్రలేఖనం, చందమామ కథలు, శతక పద్యాలు, గణిత సూత్రాలు, స్పోకెన్ ఇంగ్లిషు, గ్రామర్ తదితర వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. శిక్షణ తరగతులు నిర్వహించి వదిలేయకుండా, వారాంతపు పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులు బహుమతులను అందజేసి ప్రోత్సహిస్తున్నారు.

పుస్తక పఠనం

స్పోకెన్ ఇంగ్లిష్, గ్రామర్ తదితర అంశాలు విద్యార్థుల అభ్యున్నతికి ఎంతగానో ఉపయోగపడతాయని గ్రంథాలయ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంటర్నెట్ ప్రభావం అధికంగా ఉండడంతో చిన్నారులు ఆన్‌లైన్ గేమ్‌ల వ్యసనాల భారిన పడుతున్నారు. ఈ తరుణంలో పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెంచుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో వేసవి శిక్షణ శిబిరాలు చిన్నారులతో కళకళలాడుతున్నాయి.

విద్యార్థుల ఆసక్తి



వేసవి శిక్షణ తరగతులపై విద్యార్థులు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. చదువుతో పాటు ఇతర అంశాల్లో ఇస్తున్న శిక్షణ కారణంగా వారిలో సృజనాత్మకత, పోటీతత్వం పెరుగుతుంది. గణిత సూత్రాలు, వాటి మెళకువలు, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్చుకోవడం వల్ల పోటీ పరీక్షలో సులభంగా విజయం సాధించవచ్చు. నిష్ణాతులైన అధ్యాపకులతో పలు విభాగాల్లో అందిస్తున్న శిక్షణ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది.

– అబ్బిరెడ్డి చంద్రపద్మాదేవి, దానవాయిపేట, మహిళా గ్రంథాలయ అధికారి

రోజూ నాలుగు గంటలు

వేసవి శిక్షణ శిబిరాలను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకూ సుమారు 4 గంటల పాటు నిర్వహిస్తున్నారు. వేద గణితం, పేపర్‌తో క్రాఫ్ట్ బొమ్మల తయారీ వంటి పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థుల్లో చదువుల ఒత్తిడిని దూరం చేసేందుకు యోగా తరగతులు, వివిధ ప్రముఖుల జీవిత చరిత్రలతో పాటు ఒక మంచి పుస్తకంపై సమీక్ష వంటి ఎన్నో విషయాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. పెన్ను, పేపర్ లేకుండా సులువైన పద్ధతిలో లెక్కల్లో మెళకువలు నేర్పుతున్నారు.

దిలీప్ కుమార్‌కు ఒకేషనల్ ఎక్సలెన్సీ అవార్డు



కంబాలచెరువు: రాజమహేంద్రవరం అర్బన్ మండల విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న బి.దిలీప్ కుమార్.. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ అందజేసే ఒకేషనల్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపికయ్యారు. ఆ వివరాలను క్లబ్ అధ్యక్షుడు నాళం నరసింహారావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖలో దిలీప్ కుమార్ చేస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డుకు ఎంపిక చేశామన్నారు. జేఎన్ రోడ్డులోని ఏకేసీ రోటరీ రివర్ సిటీ హాల్లో ఈ నెల 31వ తేదీ సాయంత్రం 6 గంటలకు జరిగే కార్యక్రమంలో దిలీప్ కుమార్‌తో పాటు నాగరాజా మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.చక్రధర్, చున్నీలాల్ జాజూ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆర్.సీతామహాలక్ష్మిలకు అవార్డు ప్రదానం చేస్తామన్నారు.

నగరాభివృద్ధికి అంకితభావంతో పనిచేద్దాం

- కలెక్టర్ ప్రశాంతి
- ఉత్సాహంగా అవార్డుల ప్రదానోత్సవం



నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: నగరాభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని, కలిసికట్టుగా కార్పొరేషన్‌ను ప్రగతిపథంలో పయనింపజేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గాదాలమ్మ గుడి రోడ్డులోని బీవీఆర్ శ్రీకన్వెన్షన్‌లో శుక్రవారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వార్షికోత్సవ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనుల ఒత్తిడిలో సతమతమయ్యే అధికారులు, సిబ్బందికి ఇటువంటి కార్యక్రమాలు ఆటవిడుపు, ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. ఈ అవార్డులతో ఉద్యోగులపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. దూరదృష్టి, అపారమైన అనుభవంతో ఓవైపు యంత్రాంగానికి మార్గదర్శకత్వం వహిస్తూ, ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కమిషనర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆటపాటలతో అధికారులు, ఉద్యోగులందరూ సందడి చేశారు. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఉద్యోగుల్లో నూతన ఉత్తేజం

కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచే అధికారులు, సిబ్బందిని ఈ వేదిక ద్వారా సత్కరించుకోవటం సంతోషదాయకమన్నారు. ఈ అవార్డులు ఉద్యోగులలో నూతన ఉత్తేజాన్ని నింపడంతో పాటు వారిపై బాధ్యతను మరింత పెంచుతాయన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని కోరారు. అనంతరం పలువురు మున్సిపల్ అధికారులు, ఉద్యోగులను మెమెంటోలు, ప్రశంసాపత్రాలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, ఎస్పీ డి.నరసింహ కిషోర్, ఆర్డీఓ కృష్ణ నాయక్, ఆర్డీఎంఏ నాగ నరసింహరావు, అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎస్ఈ (ఇంజినీరింగ్), ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్ఓ వినూత్న, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

నెల రోజుల పాటు యోగా శిక్షణ



యోగా శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

సీటీఆర్ఐ: రాబోవు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెల రోజుల పాటు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపణ్యం తెలిపారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ తరగతులు కొనసాగుతాయన్నారు. యోగా ఫర్ వన్ ఎర్త్, ఫర్ హెల్త్ ఇతివృత్తంతో యోగాంధ్ర 2025 పేరిట ఒక నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా సుమారు 300 మందికి యోగాలో శిక్షణ, జిల్లా వ్యాప్తంగా వివిధ రకాలైన పోటీలు నిర్వహించడం, యోగా పాటల పోటీలు, సైకిల్ ర్యాలీ లాంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో పీఏ కిషోర్ బాబు, డాక్టర్ డీవీ రమణమూర్తి, జి.శరత్ బాబు, డాక్టర్ పీవీబీ సంజీవరావు పాల్గొన్నారు.

బిషప్ థామస్‌కు పీస్ అంబాసిడర్ అవార్డు



ఇంటర్నేషనల్ పీస్ అవార్డును చూపిస్తున్న బిషప్ థామస్

సీటీఆర్ఐ: దహించు అగ్ని వ్యవస్థాపకుడు బిషప్ డాక్టర్ థామస్‌కు ఇంటర్నేషనల్ పీస్ అంబాసిడర్ (అమెరికా) అవార్డు లభించింది. హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో తెలంగాణ శిశు,సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. థామస్‌కు అవార్డు లభించిన సందర్భంగా శుక్రవారం రాజమహేంద్రవరంలోని దహించు అగ్ని ఆడిటోరియంలో ఆయన మాతృమూర్తి దివంగత మేరీ సెల్వం జ్ఞాపకార్థం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. నగరంలోని పది మంది ప్రముఖ వైద్యులు ఈ శిబిరానికి హాజరై రోగులకు వైద్య సేవలు అందించారు. రూ.లక్ష విలువైన మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా థామస్ విలేకరులతో మాట్లాడుతూ గత 34 ఏళ్లుగా పేదలకు అనేక రకాల సేవలు అందిస్తున్నానన్నారు. వాటికి గుర్తింపుగా 139 దేశాలలో గుర్తింపు కలిగిన అమెరికన్ సంస్థ తనకు ఇంటర్నేషనల్ పీస్ అంబాసిడర్ అవార్డు ఇచ్చి సత్కరించినట్లు తెలిపారు. యువకులకు వృత్తి, విద్య నైపుణ్యంలో శిక్షణ, పదివేల మంది క్రైస్తవులకు తర్ఫీదు ఇచ్చామన్నారు.వితంతువులకు కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. వైద్యశిబిరంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో దహించు అగ్ని మినిస్ట్రీస్ యువకులు రక్తదానం చేశారన్నారు.

ప్రజల సంక్షేమాన్ని వదిలేశారు

- ప్రత్యర్థులపై కక్షలు తీర్చుకుంటున్నారు
- ప్రశ్నించిన వారిపై కేసులు
- యథేచ్ఛగా మట్టి, ఇసుక దోపిడీ
- కూటమి పాలనపై మాజీ ఎమ్మెల్యే రాజా ధ్వజం
- ఉత్సాహంగా 'నా కుటుంబం'



పల్ల కడియంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం పూర్తిగా అడుగంటిపోయిందని, ప్రత్యర్థులపై కక్షలు తీర్చుకోవడమే లక్ష్యంగా పాలన చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. నా కుటుంబం – నా కార్యకర్తలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పల్ల కడియం, రామస్వామిపేట గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. వారి కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అనేక హామీలు గుప్పించి, సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చి కూటమి నాయకులు.. ఆపై ప్రజల బాగు గురించి ఆలోచించడం మర్చిపోయారన్నారు. దొరికినంత దోచుకోవాలనే లక్ష్యంతో ఇసుక, మట్టి, కొండలను తోడేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను పక్కన పెట్టి, స్వసంక్షేమం కోసం అనేక రకాల స్కాములకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రశ్నించిన వారిని తప్పుడు కేసులతో అరెస్టులు చేస్తూ కక్ష తీర్చుకుంటున్నారన్నారు. మంత్రి నారా లోకేష్ రాసిన రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, చట్టాలను కూడా అతిక్రమిస్తూ ప్రత్యర్థులపై దూకుడు ప్రదర్శిస్తున్నారన్నారు. ఇందుకు మాజీ మంత్రి రజనీపై పోలీసులు వ్యవహరించి తీరు నిదర్శనమన్నారు.

నియోజకవర్గంలో దోపిడీ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులతో ప్రగతి పథంలో పయనించిన నియోజకవర్గం.. నేడు అన్ని విధాలా దోపిడీకి గురవుతోందని మాజీ ఎమ్మెల్యే రాజా ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరిలో నీరు లేదుగానీ చెరువులు మాత్రం దర్శనమిస్తున్నాయని చమత్కరించారు. ఇష్టానుసారంగా గోదావరిలో ఇసుకను తోడేయడంతో లోతయిన చెరువులు ఏర్పడ్డాయన్నారు. అక్కడితో ఆగకుండా కొండలను, గ్రామాలలో చెరువులను, కాలువ గట్లను కూడా తవ్వేస్తున్నారన్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా సాగుతున్న ఈ దోపిడీపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గంలో యథేచ్ఛగా జరుగుతున్న ఈ అవినీతి, అక్రమాలకు అధికార ఎమ్మెల్యే కేరాఫ్ అడ్రస్‌గా ఉండడంతో అధికారులకు ఈ దుస్థితి పట్టిందని విమర్శించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ కో కన్వీనర్ గండి నాని బాబు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అడబాల చినబాబు, ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



నైట్ పెట్రోలింగ్‌లో భాగంగా రంగంపేటలో మద్యం షాపును పరిశీలిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: మద్యం షాపులలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ సుధ హెచ్చరించారు. ఆమె శుక్రవారం మాట్లాడుతూ మద్యం షాపులు నిబంధనలకు అనుగుణంగా పనిచేసేలా చూడడానికి ప్రతి రోజూ నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. సమయ పాలన, ఎంఆర్‌పీకి మించి అమ్మకాలు లేకుండా చూడడం, మద్యం షాపుల వద్ద అనధికార సిట్టింగులు నివారించడం, షాపుల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, షాపుల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించడం, సీసీ కెమెరాల పనితీరు పరిశీలించడం వంటి ప్రధాన మైన నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి కానిస్టేబుల్‌కు మూడు లేదా నాలుగు షాపుల బాధ్యతను అప్పగించినట్టు చెప్పారు. సబ్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహించేందుకు ఎక్సైజ్ ఐ అనే మొబైల్ యాప్‌ను త్వరలో ఎక్సైజ్ శాఖ తీసుకురానున్నట్టు తెలిపారు. దాని ద్వారా మద్యం షాపులలో జరిగే కార్యక్రమాలను నేరుగా పర్యవేక్షించవచ్చన్నారు. అదే విధంగా ఎక్సైజ్ నేరాలకు సంబంధించి ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 14405కు కాల్ చేసి తెలియజేయవచ్చన్నారు.

ఆదాయానికి గండి

- గోడాడ గోషాయి భూములపై కొందరి కన్ను
- బహిరంగ వేలం నిర్వహించని అధికారులు
- పాత కౌలుదారులకు అనుకూలంగా ఎమ్మెల్యే లేఖ
- వేలం వేస్తే భారీగా ఆదాయం వచ్చే అవకాశం



కాటవరంలోని గోడాడ గోషాయి మఠం పొలాలు



పాత కౌలుదారులకే భూములు ఇవ్వాలంటూ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఇచ్చిన లేఖ

సీతానగరం: మండలంలోని కాటవరంలో ఉన్న గోడాడ గోషాయి మఠం (ఎండోమెంట్) భూములకు బహిరంగ వేలం పాట జరపకుండా పాత కౌలుదారులకే ఇవ్వాలంటూ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ లేఖ ఇవ్వడంపై కాటవరం రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మఠానికి చెందిన సుమారు 52 ఎకరాలకు జరగాల్సిన బహిరంగ వేలం పాటను గత నెలలో రెండు సార్లు వాయిదా వేశారు. వివరాల్లోకి వెళితే..

మూడేళ్ల క్రితం వేలం

రాజమహేంద్రవరంలోని గోడాడ గోషాయి మఠానికి చెందిన కాటవరంలోని 191, 269 సర్వే నెంబర్లో 51.68 ఎకరాలు ఉంది. వీటికి మూడేళ్ల క్రితం బహిరంగ వేలం నిర్వహించగా ఏడాదికి ఎకరానికి రూ.7 వేల చొప్పున చెల్లించేలా సుమారు 15 మంది రైతులు పాడుకున్నారు. దీంతో ఈ ఏడాది మార్చి 28న 2025 – 28 కాల పరిమితికి బహిరంగ వేలానికి సన్నద్ధమవ్వగా మఠం కార్యనిర్వహణాధికారి ఏప్రిల్ 23కు వాయిదా వేశారు. కొన్ని అనివార్య కారణాలతో ఆ రోజు కూడా జరగలేదు. తదుపరి బహిరంగ వేలం ఎప్పుడు అనేది పత్రికా ప్రకటన ద్వారా తెలియపర్చుతామని నోటీసును బోర్డులో ఉంచి అధికారులు వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు భూముల వేలం పాటపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం

భూముల వేలంపాట విషయంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తీరుపై రైతులు గూడపాటి సురేంద్ర, గూడపాటి జయరామ్, ప్రభావతి, దాసరి రాంబాబు, కాప శ్రీనివాస్, బొల్లి సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము బహిరంగ వేలం పాటలో పాల్గొనడానికి బ్యాంకు డీడీలు తీసి, సిద్ధంగా ఉంచామన్నారు. అయితే ఆ భూముల కౌలును 20 నుంచి 30 శాతానికి పెంచి పాత కౌలుదారులకే అందించాలని దేవదాయ, ధర్మదాయశాఖ కమిషనర్‌కు ఎమ్మెల్యే లేఖ తయారు చేశారన్నారు. దాన్ని పాత కౌలుదారులకు అందించగా, ఆ లేఖపై నీరుపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కూడా సంతకం తీసుకుని దేవదాయశాఖ కమిషనర్‌కు అందజేశారన్నారు. పాత కౌలుదారులు వ్యవసాయం చేయకుండా ఎకరానికి రూ.20 వేలకు శిస్తుకు వేరే రైతులకు ఇస్తున్నారన్నారు. వారు వ్యవసాయం చేయడం లేదని, వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. రైతుల అభిప్రాయం తెలుసుకోకుండా ఎమ్మెల్యే ఏకపక్షంగా వ్యవహరించడం ఎంతో బాధాకరమన్నారు మఠం భూములకు బహిరంగ వేలం పాట జరపాలని డిమాండ్ చేశారు.

బహిరంగ వేలం నిర్వహించాలి



గోడాడ గోషాయి మఠం భూములకు బహిరంగ వేలం నిర్వహిస్తే ఎకరానికి ఆదాయం ఐదు రెట్లు పెరుగుతుంది. వేలం పాటలో పాల్గొనడానికి డీడీలు తీసి సిద్ధంగా ఉన్నాం. కానీ అధికారులు వేలం నిర్వహించడం లేదు. పాత కౌలుదారులకే భూములు ఇవ్వాలని ఎమ్మెల్యే లేఖ రాయడం విచారకరం. రైతుల అభిప్రాయం తెలుసుకోకుండా ఏకపక్షంగా ఆయన వ్యవహరించారు. మఠం భూములకు బహిరంగ వేలం పాట నిర్వహించాలి.

– గూడపాటి సురేంద్ర, రైతు, కాటవరం

అధికారుల ఆదేశాల మేరకు చర్యలు

మఠం భూముల్లో కొన్నేళ్లుగా వ్యవసాయం చేస్తున్నామని, తమకే భూములు ఇవ్వాలని పాత కౌలుదారులు అంటున్నారు. అలాగే గ్రామంలోని రైతులు బహిరంగ వేలంపాట నిర్వహించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని దేవదాయశాఖ కమిషనర్‌కు తెలియపరిచాం. ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– నాగేశ్వరరావు, జిల్లా దేవదాయశాఖ అధికారి, రాజమహేంద్రవరం

చంద్రశేఖరస్వామికి వెండి నాభిరేకు సమర్పణ



చంద్రశేఖరస్వామికి అలంకరించిన వెండి నాభిరేకు

రంగంపేట: చండ్రేడు గ్రామంలో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామికి వెండి నాభిరేకు సమర్పించారు. గ్రామానికి చెందిన జాస్తి పద్మరాజు, కమల దంపతులు, వారి కుమారులు వీర వెంకట సత్యం శ్రీ, సాయిరామ్ శుక్రవారం ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మకు దీన్ని అందజేశారు. చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వెండి నాభిరేకును అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వంగలపూడిలో సినిమా షూటింగ్

సీతానగరం: మండలంలోని వంగలపూడిలో శుక్రవారం సినిమా షూటింగ్‌తో సందడి నెలకొంది. ఆ గ్రామ శివారును ఏటిగట్టును ఆనుకుని ఉన్న పామాయిల్, అరటి తోటల్లో షూటింగ్ చేస్తున్నారు. పీఎస్ఆర్ మూవీ మేకర్ బ్యానర్‌పై మొట్టమొదటిగా 'కొత్తగా ఉంది' అనే సినిమా చిత్రీకరణ జరుపుతున్నారు. హీరోగా హరికృష్ణ, హీరోయిన్‌గా భవ్య నటిస్తున్నారు. దర్శకుడు ఆదికి ఈ సినిమా మొట్టమొదటిది. ఈ సందర్భంగా హీరో, హీరోయిన్ల మధ్య కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు.